మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 161 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | ఆదివారం, 10 మే 2026



# అనుదినం అమ్మ డే

'ఎవరు రాయగలరు అమ్మ అను.. మాటకన్న కమ్మని కావ్యం.. ఎవరు పాడగలరు అమ్మ అను.. రాగం కన్న తియ్యని రాగం..' అవును కదా 'అమ్మ' అనే మాట కన్న మంచి కవిత్వం ఏ ముంటుంది. ఆ మాటకన్న మంచి రాగం ఏ ముంటుంది.. అందుకే అమ్మకు ఒక రోజు కాదు.. ప్రతి రోజూ ఆమె పండుగే.. మన ఊపిరిలో ఊయలూగే అమృతమైన ఆత్మీయతే అమ్మ.. అమ్మ ప్రేమకు కొలమానం లేదు. ఆమె త్యాగానికి ప్రత్యామ్నాయం లేదు. అందుకే.. మదర్స్ డే ఒక్కరోజు కాదు.. ప్రతి రోజూ అమ్మకే అంకితం.. ప్రతి ఉదయం ఆమె ఆశీస్సులే.. ప్రతి రాత్రి ఆమె జోలపాటే.. అమ్మ ఉన్న ఇల్లు ఆలయం.. అమ్మ నవ్వు జీవితానికి దీపం.. అమ్మను గౌరవించే ప్రతి క్షణమే నిజమైన మాతృదినోత్సవం.. - మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి

మాతృదినోత్సవంపై కవితా సంకలనం లోపలి పేజీల్లో..



HAPPY MOTHER'S day
@365 డేస్..

మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక

2

ఆదివారం, 10 మే 2026

Mana Chourasta

Happy Mothers Day



## అమ్మకు ఒక రోజు అని ఉంటుందా!

అమ్మ నీ ప్రేమకు ఏది సరితూగదమ్మా
అమ్మ నీ ప్రేమకు అక్షరాలు సరిపోవమ్మా
అమ్మ నీ ప్రేమ త్యాగాల కోట
అమ్మ నీ ప్రేమ ప్రతి రోజు గొంతెత్తిన పాట
అమ్మ నీ ప్రేమ తేనెలూరు మాట
అమ్మ నీ ప్రేమ అనురాగాల బాట

అమ్మ అన్నమాట అమృతం కాదా
అమ్మ కన్న వేరే దైవం కలదా
జగతిన నిత్యం అమ్మ పిలుపు లేకుండా ఉంటారా
అమ్మ ప్రేమ పొందని జనులుంటారా

అమ్మకు ఒకరోజు అని ఉంటుందా..!
ఈరోజు ఆరోజు అని ప్రత్యేకతలు ఉంటాయా..
ఇంత అంత అని లెక్కలు ఉంటాయా..
అమ్మ ప్రేమకు కొలతలున్నాయా..
అమ్మ నిత్యం నీ పాదాలకు వందనం..
అమ్మ నీ ఆశీర్వాదమే మాకు శ్రీరామరక్ష

అమ్మంటే అమ్మే.. అమ్మకు లేరు సాటి
లేరు అమ్మకు పోటీ.. అమ్మ నీడన బతకడం
అమ్మ చెంత నడయాడడం.. నిత్యం అమ్మకు సేవ చేయడం
ప్రతి రోజు అమ్మ పాదాలకు మొక్కడం
అంతకు మించి కలదా అదృష్టం
అంతకు మించి కలదా కైవల్యం



- లగిశెట్టి ప్రభాకర్,
జనగామ,
సెల్ : 9441700316

## అమ్మకు ఒక రోజు కాదు..

అమ్మకు ఒక రోజు కాదు..
ప్రతి రోజూ ఆమె పండుగే
మన ఊపిరిలో ఊయలూగే
అమృతమయిన ఆత్మీయతే

గర్భంలో గుండె చప్పుడు విని
మన జీవాన్ని జోలపాడినది అమ్మే
తన నిద్రల్ని తాకట్టు పెట్టి
మన కలలకు వెలుగైనది అమ్మే

మన చిన్న అడుగుల్లో జారిపడితే
తన ప్రాణమే
 కరిగిపోయినట్టవుతుంది
మన నవ్వు కోసం ఎన్నో బాధలను
నిశ్శబ్దంగా దాచుకున్నది


ఆకలైతే తన ముద్ద వదిలి
మన చేతిలో అన్నం పెట్టిన చేతులు
జ్వరమొస్తే రాత్రంతా కునుకు లేక
నుదుటిపై చల్లని ప్రేమైన వేళ్లు

మన తప్పుల్లో గురువై నిలిచి
మన విజయాల్లో నీడై నిలుస్తుంది
ప్రపంచం మొత్తం దూరమైనా
"నేనున్నా బిడ్డా" అని పలికేది అమ్మే

అమ్మ ప్రేమకు కొలమానం లేదు
అమ్మ త్యాగానికి ప్రత్యామ్నాయం
 లేదు
అమ్మ అనే పదం పలికినప్పుడల్లా
మనసంతా మమతగా
 మారిపోతుంది

అందుకే...
మదర్స్ డే ఒక్కరోజు కాదు
ప్రతిరోజూ అమ్మకే అంకితం
ప్రతి ఉదయం ఆమె ఆశీస్సులే
ప్రతి రాత్రి ఆమె జోలపాటే

అమ్మ ఉన్న ఇల్లు ఆలయం
అమ్మ నవ్వు జీవితానికి దీపం
అమ్మను గౌరవించే ప్రతి క్షణమే
నిజమైన మాతృదినోత్సవం



- తాళ్ళపల్లి లక్ష్మణ్ గౌడ్, జనగామ
సెల్ : 9505703606

## అమ్మ..

అమ్మ.. ఈ రెండక్షరాల వెనుక
ఎన్నో త్యాగాలు పూడ్చబడి ఉన్నాయి
ఎన్నో కన్నీళ్లు దాగి ఉన్నాయి ఐనా...
అమ్మ ప్రేమ మాత్రం మారదు..!

మాట రాని సమయాన
మనసిఅర్థం చేసుకొని
ఆకలి దుప్పలు తీర్చిన దేవత అందుకే...
కాలం మారినా, మనుషులు మారినా,
అమ్మ ప్రేమ మాత్రం మారదు..!

తన ప్రాణాన్ని రెండు ముక్కలు చేసి
ఒక ముక్కను ప్రపంచానికి పరిచయం చేసిన
హృదయ మూర్తి అమ్మ..!
మన కోసం తన యవ్వనాన్ని వంటింట్లో
కాల్చేసిన యోధురాలు అమ్మ..!

మన నవ్వు కోసం మన భవిష్యత్తు కోసం
తన బాధలు మౌనంగా గొంతులోనే దాచేసిన
త్యాగమూర్తి శంకరమ్మ..!
ఎన్ని శత్రు తుఫాన్లు వచ్చినా
మన మీద ఒక్క ధూళి కూడా పడనివ్వని
మహాతల్లి అమ్మ..!

అమ్మ గురించి కవిత రాయాలంటే
సముద్రంలో నీళ్లు సరిపోవు నాకు
ఎందుకంటే...
సముద్రానికి తీరం ఉంటుంది కాని
అమ్మ ప్రేమకు అంతం లేదు కాబట్టి..!

ఆకాశంలో నక్షత్రాలు సైతం అమ్మ ముందు
తల వంచవలసిందే ఎందుకంటే...
తన ప్రాణం నెమ్మదిగా కరిగిపోతున్నా
మన జీవితాలు వెలుగుగా ఉండాలని
కోరుకునే కొవ్వొత్తి కాబట్టి..!

అమ్మ ఒడిలో పడుకున్న క్షణం
అమ్మ చేతి ముద్ద తిన్న మధుర జ్ఞాపకం
గుర్తుంచుకో..!
మన కన్నీళ్లను తుడిచి నేను ఉన్నాను
అని చెప్పిన అమ్మ గుండెను హత్తుకోని
పడుకోని ఉన్న రోజులు
గుర్తుంచుకో..!
అమ్మ కోసం ఒక రోజు కాదు..
ప్రతి రోజు ప్రత్యేకమే..!

- మంజుల పత్తిపాటి,
ఆలేరు, యాదాద్రి జిల్లా
సెల్ : 9347042218



## కొలమానం లేని సేవ

వేదనలెన్నో గర్భకుహరంలో
 అమితానందంతో ఆస్వాదించే
 అడుగడుగునా..

సృష్టి అంకురార్పణకై
ప్రాణం పోయే పురిటి నొప్పులతో
 పునర్జన్మను పొంది మరో ప్రాణికి
 ఆయువునిచ్చి..

రుధిరాన్ని పాలధారగా మార్చి నిత్యం
 ప్రేమామృతాన్ని అందించే..

తన ఇష్టాలను త్యజించి కన్నవారి
 కలలకై అలుపెరుగని సమరమే
 సాగించే...

కాంతిపుంజమై వెన్నంటే ఉండి
 నిరంతరం కడవరకు కాచుకునే
 కనురెప్పవోలె...

ఆకలే ఎరుగదులే తన పిల్లల కడుపు
 నిండే వరకు అలసటే చెందదులే
 నిర్విరామంగా తన వారి కొరకు..

అమ్మ ప్రేమ పొందని జీవితం
నిరర్థదాయకమని జగమెరిగిన
 సత్యమై నిలిచే..

సృష్టి అంతమైన చెరపని చరితను
 లిఖించే చరితలో
 అమ్మవాత్సల్యం...

కొలమానమే లేని సేవకు
 ప్రతిరూపమై అలరాడే అనంత
 విశ్వంలో అమ్మ ప్రస్థానం...

ఒక్క రోజుతో అమ్మ ప్రేమను
 తెలుపుటకు సత్తానే చాలదులే
 నా కలానికి, అమ్మ గొప్పతనపు
 అపురూప కావ్యానికి
 అక్షరరూపం ఇవ్వడానికి...



- కొత్త ప్రియాంక (భానుప్రియ),
హైదరాబాద్,
సెల్ : 9553352929

## త్యాగమూర్తి..

- బోనాసి రేణుక,
జనగామ
సెల్ : 8790652785



త్యాగమే తన శ్వాసగా మార్చుకున్న తల్లి..
తన బిడ్డ కోసం కాలాన్నే మరిచిన మహిమ..
ఆకలి మరిచి ఆహారం పెట్టిన చేతులు..
ఆడుకుంటే ఆనందం పూసిన కన్నులు..

చిన్న నవ్వు కోసం పెద్ద ప్రపంచం వదిలి..
చిన్న జ్వరం వస్తే రాత్రంతా నిద్ర మరిచి..
పడిపోతే కన్నీళ్లు కంటికి రాక ముందే..
తనువు తరిగిపోతున్న తపించే తల్లి..

కొండంత బాధను గుండెల్లో దాచుకొని..
అలాంటి అమ్మను ఒక రోజు ఒంటరిగా..
వృద్ధాశ్రమం గదిలో విడిచిపెట్టే హృదయం..
ఎలా రాయిగా మారుతుందో ఆలోచించాలి మనం..

మనసు ఉన్న చోటే నిజమైన ఇల్లు అని మరిచి ..
మనిషితనం ఎక్కడో కోల్పోతున్న నిదర్శనం...
అమ్మ ఎదురుచూపుల్లో ఇంకా ప్రేమే ఉంది..
ప్రతి అడుగులో నీ జ్ఞాపకాలు వెంటాడుతుంటే..

బతికుండగానే మృతిలా మారిన జీవితం..
మనిషి హృదయం ఎంత క్రూరమో చెబుతుంది..
అమ్మకు ఒక రోజు కాదు..
అమ్మ త్యాగానికి యుగాలైన సరిపోవు..
తల్లి కన్నీటి విలువ తెలుసుకున్న రోజు..
మనిషితనం తిరిగి పుడుతుంది ..



## అనసూయమ్మ

జీవితంలో అసూయ
ఎరుగని మా అమ్మ
అనసూయమ్మ
జీవితమంతా పిల్లలతోనే

అమె లగ్గం తరువాత
పుట్టిన మరిదిని ఎత్తుకున్న
రోజు నుండి ఇప్పుడు నా
బిడ్డను ఆడిస్తున్న వరకు

నలుగురు పిల్లల బతుకు
బండిని నాన్నతో కలిసి
లాగిన కష్టమొచ్చినపుడల్లా
నాన్నకు కూడ తల్లీ ఆమె

ఛానల్లకందిన సంతానాన్ని
శోభామయంగా తీర్చిదిద్దిన
'రమాదేవి'....'సోమేశ్వర'
'వరప్రసాదమే' అమ్మ

కన్న కడుపు చించితే
కాళ్ళమీద పడుతదంటూ

పిల్లలకొచ్చిన కష్టాలను
కడుపునపెట్టుకసాకింది

మనసు కుంగినపుడు
ఆమె సహనాన్ని
గుర్తు చేసుకోని మేము
లేచి నిలపడ్డ రోజులెన్నో

నాన్న ప్రతీకలే ఆమె
ఆలోచనలు అయిన
వేళ ఆయురారోగ్యాలతో
మా అమ్మ చల్లగుండాలే..



- పెట్లోజు సోమేశ్వరాచారి,
కవిహృదయం సాహిత్య వేదిక
వ్యవస్థాపక అధ్యక్షులు, జనగామ
సెల్ : 9948989778



## మాతృమూర్తికి వందనం

నాకు జన్మనివ్వడం అంటే
నీకు మరుజన్మ ఎత్తడమే
అని తెల్సినా
ఆనందముగా ప్రాణప్రతిష్ట చేస్తావు
నాకు నీ గర్భగుడిలోనా

వేవిళ్ల అజీర్తి అసౌకర్యాలను
సౌకర్యాలుగానే అనుభవిస్తావు
నీ వెన్నుపూసపై నా బరువు
బాధను పంటి బిగువున దాస్తావు

"క్యార్"మనే నా తొలి ఏడ్పు శబ్దమే
నీ ఎదలో ఓంకారమై ధ్వనిస్తోంది
నరకతుల్యపు పురిటి నొప్పల
బాధను నువ్వు మరచిపోయేలా
చేస్తుంది

నాకు ప్రేమార ముర్రుపాలు తాగించి
ఆరోగ్యసంరక్షణ కంచెను నిర్మిస్తావు
నా మలమూత్రాల కంపును
ఇంపుగనే భావిస్తూ నన్ను
పరిశుభ్రపరుస్తావు

నా ఆకలిదప్పులు తీర్చడానికి నీవు
నీ ఆకలిదప్పులనే మాటే మరుస్తావు
నా కోరికలన్నీ తీర్చడానికి నీవు
నీ అవసరాలను కూడా త్యజిస్తావు

నా ఎదుగుదలే నీ జీవిత లక్ష్యమై
ప్రతిక్షణం పరితపిస్తూ ఉంటావు
ప్రయోజకుడనై కళకళలాడుతుంటే
ఆనంద భాష్పాలు కురిపిస్తావు

ఉద్యోగాలకోసమై మేము పరుగెడితే
మళ్ళీ తల్లై సంరక్షిస్తావు నా పిల్లలను
కంటికిరెప్పలా కాపాడుతావు
నా గృహ, వస్తు, వాహనాలను

వయసిచ్చిన శరీర నిగారింపుతో
అలరారుతుంటాను నేను
వయసుడిగి వడలిన దేహంతో
బాధపడుతుంటావు నీవు

నీ క్షేమ సమాచారం
విచారించకున్నా
ఏనాడూ బాధపడవు
నీ ఆకలిదప్పులు విస్మరించినా
ఏనాడూ తూలనాడవు

ఇంత వయసొచ్చినా నీకేంకావాలనే
ఆత్మీయతే నీది
నీకేమికావాలో అడుగులేని
అమాయకత్వమే నీది

మధుర ఫలాలనిచ్చి సేదదీర్చే తరువు
లాంటిది నీకాయము
ఎంత తోడినా మమతలూరే
ఊటబావి
లాంటిది నీహృదయము
తీర్చుకోలేనిది నీ ఋణం అని
తప్పించుకో జూస్తున్నాము
మనుమల్లు, మనుమరాళ్ళతో
జీవితాంతం నువ్వు
గడిపేలాచేస్తాము

ప్రతీరోజు మాతృదినోత్సవము
లాగానే నిన్ను పూజిస్తాము
ప్రతి నిత్యం నీ సుందర వదనములో
నవ్వుల పూవులు పూయిస్తాము



- కె.రాజ్ కుమార్,
స్కూల్ అసిస్టెంట్, జడ్పీహెచ్ఎస్,
సాల్వపూర్

## నీ అడుగుల సవ్వడి

అమ్మ నీ అడుగుల సవ్వడి
అమ్మ నీ ప్రతిరూపం నేనైతేని
నా గుండె చప్పుడు నీవైతివి
ఆత్మ పరమాత్మలను
నేనెరుగ నైతిని
నా ఆది దైవం మాత్రం నీవంటివి
నా ఈ అడుగుల సవ్వడి నీదైతే మీ
ఆనందానికి ప్రతిరూపం నేనైతిని

నీ జీవితమనే పరుగు ప్రయాణంలో
నాన్నచే
చివరికంటూ భాగింపబడ్డావు
ప్రతిఫలం అంతా సంతానాన్ని
నొసంగి చివరికి శేషం సున్నాలాగా
మిగిల్చావు
దారి వెంబడి ముల్లంటూ
నీవు మాత్రం నొప్పి భరిస్తూ
మాకై నీవు పడిన బాధలు
ఎన్నో ఎన్నెన్నో ఏమని చెప్పను అమ్మ



- మల్యాల జనార్దనా చారి
పెంబర్తి, జనగామ జిల్లా
9000585101

## స్వర్గమే.. నీ పాదాల కింద..

కంటికి కనబడని రక్తపు ముద్ద స్థాయి మొదలు..
నీవే ఇంకో ప్రాణికి జీవం పోసే స్థాయి వరకు..
బలపం పట్టి అక్షరాలు దిద్దే కాలం మొదలు,
నీవే అక్షరాలను నేర్పించే స్థాయి వరకు..

పదాలు పలకలేని స్థాయి మొదలు, ఆ పదాల
పల్లకిలో కోటలు కట్టే కాలం వరకు..
నవ మాసాల కాలం మొదలు, నీకు నూరేళ్ల
వయస్సు వచ్చే కాలం వరకు, తరగనిది అమ్మ ప్రేమ

పాలలోని తెలుపు, మల్లెల సువాసనల స్వచ్ఛత
అమ్మ ప్రేమ ఏ మాత్రం అతిశయోక్తి కాదు..
జీవిత చక్రం అనే వలయంలో నిరంతరం ప్రేమను
పంచే, అలుపెరగని బాటసారి అమ్మ

నిస్వార్థ మైన ప్రేమ కొలువుదీరిన కోవెలలాంటి అమ్మ
ప్రేమకు, ఈ జీవితకాల పాదాభివందనాలు....
స్వర్గమే నీ పాదాల కింద కొలువై ఉందమ్మా...
నీ ఎనలేని ఆత్మీయనురాగాలకు చాలావమ్మా
వెయ్యి వసంతలైనా..

- అల్లెపు కళ్యాణి,
పెద్దపల్లి,
సెల్ : 90632 43776




## అమ్మకు ఒక రోజు కాదు

కమ్మనైన అమ్మ పిలుపు
అమ్మ అనే పిలుపే ఒక కావ్యం
దేవుడు కోరిన వరాలు ఇస్తాడు
అమ్మ కోరని వరాలు ఎన్నో ఎన్నో
ఎన్నెన్నో ఇస్తుంది
దేవుడు మొక్కితేనే వరాలిస్తాడు
కానీ అమ్మ
బిడ్డ కడుపులో ఉన్నప్పటి నుండే
దెబ్బ తగలకుండా
ఇబ్బంది కలగకుండా
జన్మించక ముందు
నుండి వరాలిస్తుంది
తన బిడ్డకు ఆకలిస్తే
అమృత ఆహారాన్ని ఇస్తుంది
బిడ్డకు నిద్ర వస్తే
జోలపాడే సింగర్ అవుతుంది
బిడ్డకు గాయమైతే
గుండెకు హత్తుకుంటుంది
బిడ్డకు హాని కలిగించి దేనికైనా
అపర కాళీ అయి నిలుస్తుంది
అమ్మ ముందు
దేవుడు ఏపాటి
అమ్మకు సాటి రాదు ఏ కోటి
అమ్మ అంటే రంగుల హోలీ

అమ్మ ఒడి
బడి ,గుడి కంటే గొప్ప
అమ్మ తొలి గురువు
అమ్మ చే కళ్ళు తెరిచి
ఈ ప్రపంచాన్ని చూశాను
అమ్మ లేనిది నే నేక్కడ
ఈ ప్రపంచం ఎక్కడిది
365 రోజులు
360 డిగ్రీస్
బిడ్డకి అమ్మ రక్షణ కవచం
తన బిడ్డ తనను
అమ్మ అని పిలిచిన ప్రతిసారి
అమ్మ పుడుతూనే ఉంటుంది
ప్రతి రోజు అమ్మ ఇచ్చిన రోజు

అమ్మ పిలుపు వినగానే
అమ్మ ప్రతిసారి పుడుతూనే
ఉంటుంది
అదే అమ్మ గొప్పతనం
అమ్మని అందరం ప్రేమగా
చూసుకుందాం అని
వాగ్దానం చేద్దాం
అమ్మ కోసం
అమ్మ పిలుపు కోసం..



- అంజి శ్రీ, జనగామ,
సెల్ : 9542700333

# అమ్మనే.. ఈ అవణికంత వెలుగు

**పల్లవి :** అమ్మనే ఈ అవనికంత వెలుగునిచ్చే జన్మనే..
అనురాగమంతా జగతిలోన పంచిన నువ్వు తల్లివే
స్వచ్ఛమైన ప్రేమకు నిర్వచనమే మన అమ్మరా..
ఎంత ఎత్తుకు ఎదిగిన అమ్మ మూలకర్తని మరువకు

**చరణం 1 :** తల్లిగా నువ్వు మొదటి గురువు ఓడినే బడిగా మార్చానవు
అమ్మ అనే ఆత్మీయ ప్రేమకు పులకరించెను మదితనువూ
నేను ఎన్ని జన్మలు ఎత్తిన నన్ను మరువవు ఎడబాయవూ
మాతృమూర్తుని గౌరవించి మనిషిగా నువు మసులుకో...
...అమ్మనే...

**చరణం 2 :** నువ్వు అమ్మకడుపులో బాల్యరూపం దాల్చినప్పడే
ప్రేమపంచునూ
అమ్మపొత్తిలలో ఎదిగినా రోజుమాత్రం మరవబోకు
చుట్టూ అల్లుకున్నపేగు బంధమై వర్ధిల్లె ధరణిలో
కన్నకడుపును నిండుమనసుతో మేండుగా దీవించనమ్మ
...అమ్మనే...

**చరణం 3 :** ప్రతిభను నీకుజ్ఞానము నేర్పించే ఆచార్యునిగా ఎంతో
అమ్మనే అగుపించని త్యాగము ఔదార్యము..
దైవనామమే అమ్మ అనడం దాగి ఉన్న సత్య మిధియే
అమృత జలపాతము నీ ఓపికకు మరో పేరులే
...అమ్మనే...

**చరణం 4 :** ఓర్పు నేర్పుకు జీవనం నువు ఒదిగి ఉంటేనే శాశ్వతం
మానవత్వము మరువక అమ్మసేవచేయుచు తరిగిపో
మాతృదేవోభవనీ అంటారు మర్చిపోతారు మాతృమూర్తిని
మనిషిగా బ్రతికున్నకాలం సృష్టిలో అమ్మనే మూలం
...అమ్మనే...



- పిన్నింటి రత్నం,
సారథి కవి, గాయకులు
సెల్ : 9963664534

HAPPY MOTHER'S day
@365 డేస్..





# విద్యా వారోత్సవాలు సక్సెస్ చేయాలి

- **అగ్రి స్టాక్‌లో రైతుల నమోదు వేగవంతం చేయాలి**
- **జనగణనలో భాగంగా స్వీయ గణన జాగ్రత్తగా నిర్వహించాలి**
- **ధాన్యం కొనుగోళ్లలో రవాణా త్వరితగతిన చేపట్టాలి**
- **రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**




**జనగామ, మన చౌరాస్తా :** 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి 17 వరకు నిర్వహించే విద్యా వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. శనివారం 99 రోజుల ప్రత్యేక ప్రణాళిక విద్యా వారోత్సవాలు, వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ, జనగణన స్వీయ విధానం, ఫార్మర్ రిజిస్ట్రీ, తదితర అంశాలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు హైదరాబాదు నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి, సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. అగ్రి స్టాక్ - ఫార్మర్స్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇంకా నమోదు చేయించుకోని రైతులు త్వరితగతిన తమ వివరాలను నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు. ఫార్మర్స్ రిజిస్ట్రీ అనేది రైతులకు ప్రభుత్వ పథకాల లబ్ధి నేరుగా అందించేందుకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. అదే విధంగా జిల్లాలో ఇప్పటివరకు అగ్రి స్టాక్ - ఫార్మర్స్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియ 81 శాతం పూర్తయిందని వెల్లడించారు. గ్రామ స్థాయిలో వ్యవసాయ అధికారులు, సంబంధిత సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తూ నమోదు ప్రక్రియను కొనసాగిస్తున్నారని కలెక్టర్, సీఎస్‌కు వివరించారు. జనగణనలో భాగంగా స్వీయ గణన విధానం అత్యంత ప్రాధాన్యతతో జాగ్రత్తగా నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ స్వీయ గణన ప్రక్రియలో పాల్గొని, ఖచ్చితమైన వివరాలు నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై హమాలీలు, రవాణా, బస్తాల నిల్వలు, ఓపీఎంఎస్ నమోదు, తాడిపత్రిలు వంటి వాటిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, అలాగే రైతులకు చెల్లింపులు త్వరితగతిన వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేలా తగిన విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరచడానికి 99 రోజుల విద్యా కార్యాచరణ ప్రణాళికను మే 11 నుంచి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి రోజున, వేసవి శిబిరాలు, శంకుస్థాపనల కింద పాఠశాలల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డే నిర్వహించి, మౌలిక వసతులను మెరుగుపరచాలన్నారు. రెండో రోజున, పదో తరగతి రెమెడియల్ తరగతుల నిర్వహణలో భాగంగా ఫెయిల్ అయిన 10వ తరగతి విద్యార్థుల కోసం రెమెడియల్ తరగతులు నిర్వహించాలన్నారు. మూడో రోజున, ప్రజాప్రతినిధులతో వర్క్‌షాప్ లో భాగంగా నియోజకవర్గ స్థాయిలో సర్పంచులతో వర్క్‌షాపులు ఏర్పాటు చేసి విద్యా కార్యక్రమాలపై చర్చించాలన్నారు. పాఠశాల విద్యార్థులకు అందించే పథకాల గురించి వివరించాలన్నారు. అకడమిక్, విద్యార్థి సంక్షేమం, విద్యా ప్రమాణాలపై తెలియజేయాలన్నారు. నాలుగో రోజున "బడిబాట" కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్దేశించిన లక్ష్యాల వారీగా విద్యార్థుల సంఖ్య పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐదో రోజున, లైబ్రరీ డే కింద జిల్లా, గ్రామ స్థాయిలో, పాఠశాలల్లో "లైబ్రరీ డే" నిర్వహించాలన్నారు. లైబ్రరీల వినియోగాన్ని పెంచాలన్నారు. విద్యార్థులలో పఠనాసక్తిని పెంపొందించి, లైబ్రరీ వినియోగ అలవాట్లను అభివృద్ధి చేయాలన్నారు. ఆరో రోజున, ఆర్ట్, క్రాఫ్ట్ & కల్చరల్ డే కింద పాఠశాలల్లో కళలు, చేతిపనులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఏడో రోజున, విద్యా వేడుకలను ఘనంగా చేపట్టాలని, జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేయాలన్నారు. అదే విధంగా జూనియర్ కళాశాలల్లో ఐఎఫ్పీల ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేపట్టాలని, విశ్వవిద్యాలయాల్లో కృత్రిమ మేధ సెమినార్ లను నిర్వహించాలని, అలాగే డిగ్రీ విద్యలో అప్రెంటిస్‌షిప్ తప్పనిసరిగా ఉండాలని, విద్యార్థులకు స్టైఫండ్ అందించాలని, కోర్సు పూర్తి అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని, ఉచితంగా ఆన్లైన్ లో ఐసెట్ కోచింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మే 11వ తేదీన విద్యా వారోత్సవాల కింద ఎల్బి స్టేడియంలో నిర్వహించే కార్యక్రమానికి జిల్లాల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు, ఏపీపీసీ సభ్యులను బస్సుల ద్వారా అన్ని వసతులతో తరలించేలా, అందుకు సంబంధించిన పూర్తి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సిఎస్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఏడు రోజుల పాటు చేపట్టే విద్యా వారోత్సవాలను ప్రణాళికకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. విద్యా వారోత్సవాల్లో భాగంగా విద్యాసంస్థల్లో పనుల శంకుస్థాపనలు, ఎస్ఎస్సి పరీక్షల్లో అనుత్తీర్ణులైన విద్యార్థుల ఉత్తీర్ణత కోసం ప్రత్యేక విద్య శిబిరాల నిర్వహణ, వర్క్ షాప్ ల ఏర్పాటు, జయశంకర్ బడిబాట కార్యక్రమం, విద్యా వేడుకల కార్యక్రమాలు నిర్ణీత ప్రణాళిక ప్రకారం సరైన విధంగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి జూనియర్ కళాశాలకు నాలుగు ఐఎఫ్పీలు కేటాయించారని, వాటి ప్రారంభోత్సవాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని తెలిపారు. అలాగే ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను నిర్దేశించిన లక్ష్యాల వారీగా త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. అదే విధంగా జనగణన ప్రక్రియకు సంబంధించి స్వీయ గణన విధానంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పాల్గొని, వేగవంతం అయ్యేలా చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో వేగం పెంచాలన్నారు. రవాణా విషయంలో తగు చర్యలు తీసుకోవాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే తరలింపు చేపట్టాలని, తగినన్ని గన్ని సంచులు, లారీలు, ఓపీఎంఎస్ నమోదు, తగినంత మంది హమాలీలను అందుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు. ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీసిలో జెడ్పీ సీఈవో, ఇంచార్జి డిఆర్డిఓ రంగా రావు, అదనపు డీఆర్డీఓ నూరుద్దీన్, సీపీఓ చిన కోట్యా నాయక్, డీఎంఓ రామకృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వెలకట్టలేని ప్రేమ

అమ్మ ఒక పదం కాదు..
అది ఓ అనంతమైన భావం..
మన మొదటి ఊపిరి నుంచి
చివరి అడుగు వరకు
తోడుండే నీడ..

తన చేతి స్పర్శలో ప్రేమ
ఉంటుంది..
తన మాటల్లో ధైర్యం ఉంటుంది..
తన కళ్లలో మన భవిష్యత్తు
ఉంటుంది..
తన గుండెల్లో మన ప్రపంచం
ఉంటుంది..

మన కోసం ఎన్నో
కష్టాలు పడుతూ
ఎప్పుడూ నవ్వుతూనే
ఉంటుంది అమ్మ..
మన సంతోషం కోసం
తన సంతోషాన్ని త్యాగం
చేస్తుంది..

అమ్మ ఒడిలో దొరికే ప్రశాంతత
ఈ ప్రపంచంలో ఎక్కడా
దొరకదు..
అమ్మ ప్రేమకు విలువ కట్టలేం..
అది జన్మ జన్మల బంధం..!



- ఓ సంతోష్ కుమార్,
సీనియర్ జర్నలిస్ట్, జనగామ,
సెల్ : 8106515200



## త్యాగ శిఖరం

ప్రతి ప్రేమ వెనుక ఏదో ఒక స్వార్థం..
అమ్మ ప్రేమలో మాత్రమే అనంతమైన త్యాగం..
విధి రాసిన వింత రాతకు ఎదురీత మా అమ్మ..
ఆటుపోట్లపై సమరశంఖం మా అమ్మ..

జీవన్మరణ పోరులో ఆరని అగ్గిబరాటా ఆమె..
నిలువెత్తు శ్రామిక సౌందర్యం ఆమె!
పేగు మొలకల ప్రాణం కోసం తన రక్తార్పణ..
బిడ్డల భవితవ్యంకై ఆమెది నిరంతర జాగరణ!

సామాజిక వివక్షల నడుమ ఒంటరి పోరు..
ఆకలి తీర్చడం కోసం అనురాగ హోరు..
బిడ్డల సంరక్షణలో ఆ మాతృమూర్తికి
ఎవరూ సాటిరారు..

బతుకు పయనంలో అజేయ
ధీరవనిత నిర్మలమ్మ..
నా నిండు జీవితానికి నీడనొసగే
కల్పవృక్షం నిర్మలమ్మ..
అవరోధాల గడప దాటి ఆకలి నింపిన
అక్షయపాత్ర నిర్మలమ్మ..

సమస్యల సుడిగుండాలను చీల్చిన
అగ్నిశిఖ నిర్మలమ్మ..

లోకం వెక్కిరించినా.. కాలం సవాలు విసిరినా..
ఆత్మబలమే ఆయుధంగా..
అనురాగమే కవచంగా
మమకారపు మహాశక్తి మా అమ్మ..
నా అస్తిత్వానికి అసలైన అక్షరం నిర్మలమ్మ..

- బొమ్మగాని శ్రీకాంత్ గౌడ్
సీనియర్ జర్నలిస్టు, కవి
సెల్ : 7416250849

HAPPY MOTHER'S day
@365 డేస్..




మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక
ఆదివారం, 10 మే 2026
Mana Chourasta




# ఈ నెల 11న కలెక్టరేట్ ముట్టడి

**చిల్పూర్, మన చౌరాస్తా :** రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 11వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సిపిఎం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. శనివారం చిల్పూర్ మండలంలోని బియ్యం మిల్లులు, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సిపిఎం మండల కమిటీ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా మండల కార్యదర్శి సాదం రమేష్ మాట్లాడుతూ.. పది రోజుల క్రితమే కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం తరలించాలని కోరినప్పటికీ, అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని విమర్శించారు. ప్రభుత్వ తీరు "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్న చందంగా ఉందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో సేకరణ జరగకపోవడంతో రైతులు గత్యంతరం లేక ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారని, దీనివల్ల క్వింటాల్‌కు కేవలం ₹1600 నుండి ₹2000 మాత్రమే పొందుతూ తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన గాలివానల భయంతో రైతులు కల్లాల వద్దే ఆందోళనతో గడుపుతున్నారని పేర్కొన్నారు. అలాగే కొందరు మిల్లు యజమానులు 41 కిలోలకు బదులుగా 42 నుండి 44 కిలోల వరకు తూకం వేస్తేనే దించుకుంటామని రైతులను వేధిస్తున్నారని, ఈ దోపిడీని వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. వరి, మొక్కజొన్న ధాన్యాలను తక్షణమే సేకరించి, రైతులకు వెంటనే నగదు చెల్లించాలని, అదనపు తూకం పేరిట సాగుతున్న దందాను ఆపాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం మే 11న నిర్వహించే కలెక్టర్ కార్యాలయ ముట్టడిలో చిల్పూర్ మండల రైతులంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆవుల ప్రభాకర్, అపారదాపు రాజు, కర్రె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- రఘునాథపల్లి ఎంపీడీవో గార్లపాటి శ్రీనివాసులు

**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** భానుడి భగభగలతో ఎండ తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రఘునాథపల్లి ఎంపీడీవో గార్లపాటి శ్రీనివాసులు తెలియజేశారు. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతున్నందున, ప్రజలు తమ ఆరోగ్య విషయంలో రాజీ పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

**ఈతకు వెళ్లడం ప్రమాదకరం**

ప్రస్తుతం ఎండల వేడి నుంచి ఉపశమనం పొందేందుకు గ్రామీణ ప్రాంతాల్లోని యువత, విద్యార్థులు చెరువులు, కుంటలు, బావులు మరియు కాలువల్లో ఈతకు వెళ్లే అవకాశం ఉందని, ఇది చాలా ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. నీటి లోతుపై అవగాహన లేకపోవడం, పాచి పట్టిన రాళ్లు ఉండటం వల్ల ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలు నీటి వనరుల వద్దకు వెళ్లకుండా ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని కోరారు.

**వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు**

- మధ్యాహ్నం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి, ఆ సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదు.
- బయటకు వెళ్లాల్సి వస్తే తలకి టోపీ లేదా రుమాలు ధరించాలి, గొడుగు వెంట ఉంచుకోవాలి.
- శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఉండేందుకు మంచినీళ్లు, ఓఆర్ఎస్ కలిపిన నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలను అధికంగా తీసుకోవాలి.
- వేడి త్వరగా గ్రహించని తెల్లటి పల్చని నూలు (కాటన్) దుస్తులు ధరించడం శ్రేయస్కరం.
- ముఖ్యంగా చిన్న పిల్లలు, గర్భిణీలు, వృద్ధులు ఎండలో తిరగకుండా ఇంటి పట్టునే ఉండాలి.
- ఒకవేళ ఎవరైనా వడదెబ్బకు గురైతే వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని ఎంపీడీవో గార్లపాటి శ్రీనివాసులు సూచించారు.

# లింగంపల్లిలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

**చిల్పూర్, మన చౌరాస్తా:** చిల్పూర్ మండల పరిధిలోని లింగంపల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త బి. సౌందర్య రైతులకు సాగుపై కీలక సూచనలు చేశారు. వరి రకాలు, సాగు యాజమాన్య పద్ధతులు, యూరియా వినియోగాన్ని తగ్గించడం, భూసార సంరక్షణ, సమతుల్య ఎరువుల వాడకం మరియు నీటి పొదుపు పద్ధతులపై రైతులకు సమగ్ర అవగాహన కల్పించారు. పంట మార్పిడి, సేంద్రీయ వ్యవసాయం, సమగ్ర చీడపీడల నివారణ పద్ధతులను పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, పరిశోధన విస్తరణ సలహా మండలి సభ్యులు, వ్యవసాయ విద్యార్థులు మరియు స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



**రఘునాథపల్లి, మన చౌరాస్తా :** కిడ్నీ సమస్యతో బాధపడుతున్న నిరుపేద కుటుంబానికి స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అండగా నిలిచారు. రఘునాథపల్లి మండలం ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన గ్యార శారద గత కొంతకాలంగా తీవ్రమైన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే మానవతా దృక్పథంతో స్పందించి సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 2 లక్షల 50 వేల ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన చెక్కును శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు లింగాల జగదీష్ చంద్ర రెడ్డి, మండల అధ్యక్షుడు కోల రవి గౌడ్, ఉప సర్పంచ్ చింత నరేష్, గ్యార నాగరాజు, మేడిపల్లి నరేష్, బానోత్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.


Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**